76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 47, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 13 - ఆదివారం 19 ఆగస్టు, 2018

వివరాలు 2లో...



బాషా సేవలు మరచిన టీడీపీ

వివరాలు 3లో...



స్వాతంత్ర్య సమరంలో మహిళలు

వివరాలు 3లో...



మాల్యా ఇంట్లో గోల్డెన్ టాయిలెట్!

వివరాలు 4లో...






## ముందస్తు ఎన్నికల దిశగా రాజకీయం ?

# ఆంధ్రకూ తప్పదా ?

### ఎన్నికల కమీషన్‌పై భా.జ.పాకు అనుమానాలు



**రాజధాని వార్తలు అమరావతి బ్యూరో** డిసెంబర్‌లో మూడు రాష్ట్రాలు - రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ ఎన్నికలు జరగనున్న తరుణంలో లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరగవచ్చనే ఊహాగానాలు ముమ్మరమయ్యాయి. లోక్‌సభకు శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే డబ్బు ఎంతో ఆదా అవుతుందని ప్రధాని మోడీ పలుమార్లు చేసిన సూచన లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరగవచ్చని ఊహాగానాలకు తావిచ్చింది. ఈ సంవత్సరం కొన్ని రాష్ట్రాల ఉప ఎన్నికలు, కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలతో మళ్ళీ లోక్‌సభ ముందస్తు ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలకు తెరతీశాయి.

డిసెంబర్‌లో జరగనున్న మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ప్రధాని మోడీకి అనుకూలంగా ఉండవని పలు సర్వే సంస్థలు పేర్కొనటం ప్రధాని మోడీ తిరిగి లోక్‌సభ ముందస్తు ఎన్నికలపై తిరిగి ఆలోచించే పరిస్థితి వచ్చిందని అంటున్నారు. అయితే ముందస్తు ఎన్నికలు భా.జ.పా కు అచ్చి రాలేదని గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయని కొందరు నాయకులు ప్రధానికి చెప్పినట్లు తెలుస్తుంది. ఎన్నికల నిర్వహణ ఎన్నికల కమీషన్ పరిధిలో ఉన్నందున లోక్‌సభ రద్దయినా డిసెంబరులోనే ఎన్నికల కమీషన్ లోక్‌సభకు ఎన్నికలు నిర్వహిస్తాయనే హామీ లేదని ఈ నేతలు ప్రధానికి సూచించినట్లు వార్తలు వినవచ్చాయి. డిసెంబరు శాసనసభ ఎన్నికల తర్వాత కొన్ని వారాలలోనే మరి కొన్ని శాసనసభలకు ఎన్నికలు జరగనున్న విషయాన్ని కూడా నేతలు ప్రధాని దృష్ఠికి తెచ్చారు. కానీ ప్రధాని మాత్రం ముందస్తు ఎన్నికలు భా.జ.పా కు ముఖ్యంగా తనకు అనుకూలంగా ఉంటాయని గట్టిగా విశ్వసిస్తున్నారని అంటు న్నారు. సర్వే సంస్థల అంచనాల ప్రకారం డిసెంబరు శాసనసభ ఎన్నికలలో ఫలితాలు భా.జ.పాకు వ్యతిరేకంగా ఉంటే ఆ ప్రభావం మాములుగా ఏప్రిల్ మేలలో జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉంటుందని ప్రధాని అనుకుంటున్నారు. ప్రధానితో లోపాయికారీ అవగాహన ఉన్నట్లు ప్రచారంలో ఉన్న తెలంగాణా రాష్ట్ర సమితి, వైఎస్సార్సీ లు కూడా తమ స్వంత అవసరాల దృష్ట్యా ముందస్తు ఎన్నికలను సమర్థిస్తున్నారు. అయితే ఒకేసారి లోక్‌సభ శాసనసభలకు ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో సాధ్యం కాదని ఎన్నికల కమీషన్ రెండు మూడు సందర్భాలలో స్పష్టం చేసింది. ఈ కారణంగా సాధారణ గడువులోనే 2019 ఏప్రిల్ మేలలో ఎన్నికలు జరిగితే బాగుంటుందనీ ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఈ నెల 13న సెప్టెంబరు లోనే తె.రా.స శాసనసభ అభ్యర్దులను ప్రకటించనున్నట్లు అధ్యక్షుడు చంద్రశేఖరరావు చేసిన ప్రకటన డిసెంబరులో ముందస్తు ఎన్నికల సంకేతాన్నిచ్చింది. అదే జరిగితే ఇష్టం లేకపోయినా ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కూడా చంద్రబాబు ఎన్నికలు నిర్వహించక తప్పదు. ఈ ఊహాగానాలన్నింటికి ఆగస్టు 15న ప్రధాని మోడీ చేయనున్న ప్రసంగంలో ఒక స్పష్టత రానున్నదని విశ్లేషకుల అంచనా.




**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. ప్రకాశం బ్యారేజ్ నిండుకుండలా మారగా, గడచిన కొన్నేళ్లలో ఎప్పుడూ లేని విధంగా బ్యారేజ్ 70 గేట్లనూ ఎత్తి నీటిని సముద్రంలోకి వదులుతున్నారు.

## ఎస్ ఆర్ ఎంలో ఫ్రెషర్స్ డే సంబరాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైస్ ఛాన్సలర్ జంషెడ్ భరూఛ



మనస్వి భరతనాట్య ప్రదర్శన

**రాజధాని వార్తలు, అమరావతి :** ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం విద్యార్థులు 'అలోహ 2 కె 18' పేరుతో ఫ్రెషర్స్‌డే సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. విద్యార్థుల హర్షధ్వానాల మధ్య వైస్ ఛాన్సలర్ జంషెడ్ భరూఛ జ్యోతి ప్రజ్వలనగావించి నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనభ్యసించాలన్న కోరికతో ఒక గొప్ప విశ్వవిద్యాలయాన్ని ఎంచుకున్న విద్యార్థుల ఆశలను తాము తప్పక నెరవేరుస్తామని ఈ సందర్భంగా ఆయన హామీనిచ్చారు. అనంతరం ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, మహాగణపతి ఆరాధనను మహిత, సౌమ్య ఆలపించగా, భరత నాట్యంతో గణపతికి మనస్వి అంజలి ఘటించింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కొందరు విద్యార్థులు సాంప్రదాయ, పాశ్చాత్య గీతాలను ఆలపించగా, మరి కొందరు ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలపై ప్రదర్శనలందించి తమ ప్రతిభను చాటుకోగా, కొందరు విద్యార్థులు హాస్యవల్లరితో తమ వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారు. విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి నారాయణరావు, విశ్వవిద్యాలయం సలహాదారు వి. కురుబానందన్, రిజిస్ట్రార్ డాక్టర్ డి గుణశేఖరన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విట్‌లో స్వాతంత్ర్య దినోత్సవం



డీజీ సత్యనారాయణ

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రతిష్టాత్మక విట్ విద్యాసంస్థలో 72వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక దళాల డీజీ సత్యనారాయణ హాజరువుతారని పీఆర్వో మురళీ కృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. జెండా వందన కార్యక్రమానికి విద్యార్థులంతా హాజరుకావాలన్నారు.

## జనసేన గుర్తు పిడికిలి

**రాజధాని వార్తలు, అమరావతి :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు సభలో మాట్లాడుతూ పార్టీ గుర్తును పిడికిలిగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సమాజంలో అందరి ఐక్యతకు అన్ని కులాలు - మతాలు - ప్రాంతాలు కలసికట్టుగా ఉండి బలాన్ని చాటేలా పిడికిలి చూపుతామని - అందుకే ఈ గుర్తును ఎంపిక చేశామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీ గుర్తు అంటూ పలువురు పవన్ అభిమానులు పోస్ట్ చేశారు. అయితే దీనిపై జనసేన క్లారిటీ ఇచ్చింది. జనసేన అధికారిగా గుర్తును ఎన్నికల కమిషన్ వారు నిర్ణయిస్తారు.దయచేసి ఈ అసత్యప్రచారాలు నమ్మొద్దు అని జనసేన పార్టీ తరపున వివరించారు.




## రూపాయి ధమాల్ డాలరు 70.08 రూపాయలు



**న్యూఢిల్లీ :** రూపాయి మరింతగా పతనమైంది. మంగళవారం ట్రేడింగ్ ఆరంభంలోనే రికార్డు స్థాయిలో పడిపోయిన రూపాయి... డాలరుతో మారకపు విలువ రూ.70.08కి చేరిపోయింది. టర్కీలో ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ఆ దేశ కరెన్సీ టర్కిష్ లిరా భారీగా పతనమవుతుండడంతో ఆ ప్రభావం మన కరెన్సీపైనా పడుతోంది. సోమవారం రూపాయి మారకం విలువ ఏకంగా 110 పైసలు పడిపోయిన సంగతి తెలిసిందే. ఈరోజు మరింతగా పడిపోయి రూ.70.08 పైసల వద్ద జీవన కాల కనిష్టానికి చేరింది. మంగళవారం రూపాయి మారకపు విలువ రూ.69.93 పైసల వద్ద ముగిసింది.నేటి పతనంతో 2018లో రూపాయి విలువ పది శాతం తగ్గిపోయినట్లయింది. యూఎస్ కరెన్సీ దిగుమతిదార్లు, బ్యాంకర్ల నుంచి డిమాండ్ బాగా పెరగడంతో రూపాయి బలహీనపడుతోందని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. గురువారం స్టాక్‌మార్కెట్లు లాభాల్లో నడుస్తున్నాయి. ఉదయం 11.15 సమయంలో సెన్సెక్స్ 133 పాయింట్ల లాభంతో 37777.96 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 47 పాయింట్ల లాభంతో 11402.75 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది.

## హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం




జెండా ఊపి యాత్రను ప్రారంబిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజధాని వార్తలు, అమరావతి :** ఉండవల్లి నుంచి హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. మొదటి విడత హజ్ యాత్రకు ముస్లింలను పంపనున్న ఏపీ ప్రభుత్వం, మొదటి విడతగా యాత్రకు వెళుతున్న కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 200 మంది ముస్లింలు, ఏపీ నుంచి యాత్రకు వెళున్న 2348 ముస్లిం మైనారిటీలు, అమరావతి నుంచి హజ్ కు వెళుతున్న 77 ఏళ్ల వృద్ధురాలు సలీమ బి, అనంతపురం నుంచి రెండేళ్ల లుఖ్మన్ కూడా హజ్ కు వెళ్లడం విశేషం. 2019లో గన్నవరం విమానాశ్రయం నంచే హజ్ కు విమానాలు, కడపలో రూ.12 కోట్లతో హజ్ హౌస్ నిర్మాణం జరుగుతోంది విజయవాడలో రూ. 80 కోట్లతో


- మిగతా 2 లో

## 72వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
















# రాజధాని వార్తలు కలం

## ఏపీలో సాధ్యమా ?

ఎంజీఆర్,శివాజీగణేశన్, ఎంఆర్‌రాధా వంటి నిన్నటి తరం వారి సినిమాలు చూస్తే తమిళులు అతిగా నటిస్తారనిపిస్తుంది. ఉత్తరభారత ఆధిపత్యానికి కూడా వాళ్లు అదే విధంగా ప్రతిస్పందిస్తారని, అందువల్లే ఆ రాష్ట్రంలో హిందీ ఆనవాళ్లే కనబడవని అనుకుంటారు.. ఈ తరానికి మాత్రం తమిళ రాజకీయాలు చాలా విద్వేషంతో కొనసాగుతాయని, పగలు ప్రతీకారాలు చాలా ఎక్కువేనని అనిపించక మానదు.. అయితే వీటన్నింటికీ ముందు స్వేచ్ఛ, సమానత్వం కోసం అందరికంటే ముందుగానే చైతన్యవంతులని వారి చరిత్రను చూస్తే తప్ప మనం గుర్తించలేం..

వాస్తవానికి బ్రిటీషు వాళ్లు మనదేశానికి రాకపోయి ఉంటే బ్రాహ్మణ వ్యతిరేకంగా పోరాటాలు,ఉద్యమాలు దేశంలో ఊపందుకుని ఉండేవి. ఆధిపత్యకులాల పేరుతో అణచివేత నిరంకుశత్వానికి అందరికంటే ముందుగా ప్రతిస్పందించింది తమిళులే అని మరువలేం.. స్వాతంత్ర్యానికి పూర్వమే 1910లోనే బ్రాహ్మణ భావజాలానికి వ్యతిరేకంగా బ్రాహ్మణేతరులంతా కలసి సమసమాజాన్ని రూపొందించాలని సౌత్ ఇండియన్ లిబరల్ అసోసియేషన్‌ను స్థాపించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారంతా బ్రాహ్మణులే ఎక్కువ ఉన్నారన్న భావనతో రామస్వామి నాయకర్ వంటి వారంతా కాంగ్రెస్‌ను వీడి జస్టిస్‌పార్టీని ఆశ్రయించారు. జస్టిస్ పార్టీ కూడా సరైంది కాదని గుర్తించిన నాయకర్ ద్రావిడ (దక్షిణ భారత) భావజాలాన్ని విస్తరిస్తూ ఆపార్టీని రద్దు చేసి ద్రవిడ కజగం (ద్రవిడ సమాఖ్య) పార్టీని స్థాపించాడు. అప్పటి విద్యార్థి నాయకుడు అన్నాదురై పెరియార్‌కు ప్రథమ అనుచరుడుగా చేరి గ్రామగ్రామాన తిరిగి సామాజిక న్యాయం కోసం ప్రజలను సమీకరించాడు. 1948 సెప్టెంబరు 17న ద్రవిడ మున్నేట్ర కజగం పేరుతో అన్నాదురై రాజకీయ పార్టీని ప్రారంభించాడు. అప్పటికే కరుణానిధి జస్టిస్ పార్టీ కార్యక్రమాలతో, హిందీ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా ఉన్నారు. ఆయన రచయితగా ,వక్తగా,స్క్రీన్ ప్లే రైటర్‌గా ఆయన దూసుకుపోతున్న దశలో ద్రవిడ ఉద్యమ బాధ్యలను కూడా తీసుకున్నారు. కరుణానిధి మొదటిసారి 1957లో మొదటిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్‌ను కాదని ద్రవిడ మున్నేట్ర కజగాన్నికి తమిళ ప్రజలు పట్టంకట్టారు. అన్నాదురై మంత్రి వర్గంలో పబ్లిక్ వర్క్స్ మంత్రిగా పనిచేశారు. రెండేళ్ల తర్వాత అన్నాదురై కేన్సర్‌తో మరణించడంతో పాలనా పగ్గాలను కరుణానిధి చేపట్టారు. ఆయన రాజకీయాల్లోనే కాదు ప్రజల ప్రభావవంతం చేసే కవితలను కూడా రాయగలరు..

**"బిడ్డ పాలకై బిచ్చమెత్తు దేశంలో**
**రాళ్లకు పాలిచ్చు కథ నశించునన్నదెన్నడో**
**పేదకు బొట్టెట్టి దైవమని పూజించువారు**
**పేదను గుర్తించగ మారబోవుదెన్నడో..**
**ఎపుడొచ్చు దేశానికి చైతన్యం**
**అది తెచ్చుటేకదా మన కర్తవ్యం"**

అని పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో హిందూ తాత్వికవేత్త చంద్రస్వామిని అవినీతి కేసులో అరెస్టు చేస్తే వినాయక విగ్రహాలు పాలు తాగుతున్నాయని దేశవ్యాప్తంగా కలకలం రేగినప్పుడు కరుణానిధి రాసిన కవిత.. ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే మురికి వాడల నిర్మూలన, మనుష్యులు లాగే రిక్షాలు రద్దు చేశారు. పేదలకు రూపాయికే బియ్యం పథకాన్ని ఆయన ప్రవేశపెట్టారు. అదే సమయంలో రైతులకు పంట రుణాలు, పంటలు పండకుంటే రుణమాఫీలు చేశారు. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే రామస్వామి, అన్నాదురై కరుణానిధి వీరంతా బీసీలే .. హేతువాదం,సమతావాదం, సాంఘిక న్యాయం కోసం పోరాడిన వారే.. పక్కరాష్ట్రంలో బీసీలు అధికారాన్ని చేపడితే ఆంధ్రరాష్ట్ర పరిస్థితి మారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇక్కడే పాలించేది రెండే రెండు కులాలు.. ఒకటి రెడ్డి, రెండు కమ్మ.. జనాభా పరంగా చూస్తే ఇద్దరూ అల్ప సంఖ్యాక వర్గాలే అయినా ఇన్నేళ్లు ఇదే పాలనను కొనసాగిస్తున్నారు.. తమిళనాడు మాదిరి ఇక్కడ ఒక బీసీ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి ఎంత సమయం పడుతుంది ? బీసీల పరిస్థితే ఇలా ఉంటే మైనార్టీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం చేపట్టగలరా ? సమానత్వం కోసం ఆత్మాభిమానం కోసం తమిళులు నిర్వహించిన ద్రవిడ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడినా ఎస్సీలు, ఎస్టీల జీవనంలో మాత్రం ఎటువంటి పురోగతి లేకపోవడం విచారకరం.

## 'భారత్ మతాకీ జై' అనాల్సిందే : చౌధురి



**లక్నో :** భారత్ మతాకీ జై అనే నినాదం సహజ సిద్ధంగా రావాల్సిందేనని, అది దేశంపై ఉన్న ప్రేమ, భక్తిలకు నిదర్శనమని ఉత్తరప్రదేశ్ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఛౌదురి లక్ష్మీనారయణ తెలిపారు. ముఖ్యంగా భారత పతాక ఆవిష్కరణ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతి పౌరుడు నోట రావాల్సిందేనని చెప్పుకొచ్చారు. మదర్సాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలనే ఆదేశాలను ఆయన తప్పుబట్టారు. ప్రతీ ఏడాది మదర్సాల్లో జెండా పండుగ జరుగుతోందని, జాతీయ గీతం ఆలిపిస్తున్నారని, భారత్ మతాకీ జై అని నినదిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ఎక్కడా ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం లేదన్నారు. జెండా పండుగ నిర్వహించి అమరుల త్యాగాలను గుర్తుచేసుకుంటామన్నారు. ఇక కొంత మంది జాతీయ గీతం ఆలిపించాలా? లేదా అని సందిగ్ధంలో ఉన్నారన్నారు. సీనియర్ హైకోర్టు లాయర్, ఆల్ఇండియా ముస్లిం బోర్డు సెక్రటరీ జాఫర్యాబ్ జిలానే అందరు జాతీయ గీతాన్ని గౌరవిస్తూ పాడాలని చెప్పినట్లు మంత్రి గుర్తుచేశారు.రాష్ట్రంలోని మదర్సాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలని, జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం 'భారత్ మాతాకి జై' అని నినదించాలని, జాతీయ గీతాన్ని విధిగా పాడాలని షియా వక్ఫ్‌బోర్డు చైర్మన్ వసీం రజ్వీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

## మహా సంప్రోక్షణ ప్రసారానికి అభ్యంతరాలు ఏమిటి?

### టీటీడీని ప్రశ్నించిన హైకోర్టు

**హైదరాబాద్ :** తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే మహా సంప్రోక్షణను టివి ఛానెళ్లలో ప్రసారం చేసేందుకు నిరాకరించిన టిటిడి పై మరోసారి హైకోర్టులో విచారణ జరిగింది.ఆగస్టు 11నుండి 17 వరకు జరిగే మహా సంప్రోక్షణను అన్ని ఛానెళ్లలో ప్రసారం చేయాలని కోరుతూ ఒక భక్తుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై ఇప్పటికే ఒకసారి విచారణ జరుగగా శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. మహా సంప్రోక్షణ ను టీటీడీ ఛానల్ లో అయినా ప్రసారం చేయడానికి అభ్యంతరాలు ఏమిటని హైకోర్టు టీటీడీని ప్రశ్నించింది.

ఆగమ శాస్త్రం ప్రకారం మహా సంప్రోక్షణ ఎలాంటి టీవీ ఛానెల్స్ లో ప్రసారం చేయడానికి వీల్లేదని టీటీడీ వాదించింది. అంతేకాదు మహా సంప్రోక్షణ జరుగుతున్న సమయంలో సీసీటీవీలను కూడా నిలిపేస్తామని టీటీడీ కోర్టుకు తెలిపింది. అయితే గర్భగుడిలో కాకుండా బయట కెమెరాలను ఎందుకు వద్దంటున్నారో తెలపాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో పిటీషనర్ కోరారు. మహా సంప్రోక్షణ జరుగుతున్న సమయంలో కనీసం టీటీడీ ఛానెల్ లోనైనా ప్రసారం చేయాలని పిటిషనర్ కోరారు. మహా సంప్రోక్షణ తేదీలను ఇష్టానుసారంగా మారుస్తూ ప్రజల సెంటిమెంట్‌ను టీటీడీ దెబ్బతీస్తోందని ఆరోపించారు. అసలు మహా సంప్రోక్షణ విధివిధానాలు సరిగా లేవని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్. దీంతో ఈ విషయమై మరోసారి విచారణ జరిపిన హైకోర్టు కనీసం టీటీడీ ఛానల్ లో అయినా ప్రసారం చేయడానికి అభ్యంతరాలు ఏమిటని హైకోర్టు టీటీడీని ప్రశ్నించింది. ఆ అభ్యంతరాలు ఏమిటో తెలపాలని టీటీడీని హైకోర్టు ఆదేశించింది.


## బాషా సేవలు మరచిన
# తెలుగుదేశం పార్టీ



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రుల అభిమాన నటుడు ఎన్టీ రామారావు తెలుగు దేశం పార్టీని ప్రారంభించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరి అనేక విధాలుగా సేవలందించిన లాల్ జాన్ బాషాను టీడీపీ విస్మరించింది. 2013 ఆగస్టు 15న జెండా వందనం కోసం హైదరాబాద్ నుంచి గుంటూరుకు వస్తూ.. కారు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయిన ఆయన కుటుంబాన్ని తెలుగుదేశం పూర్తిగా పక్కన పెట్టింది. మరో కారు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రం నాయుడు కుమారుడు కింజరపు రామమూర్తినాయుడు రాజకీయాల్లోకి వచ్చి ఎంపీగా కొనసాగుతున్నాడు.. ఆయన మృతితోనే పార్టీలోకి వచ్చిన సోదరుడు కింజరపు అచ్చెన్నాయుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు... అయితే సీఎం చంద్రబాబు మాత్రం బాషా కుటుంబానికి ఏమాత్రం సానుభూతి కూడా చూపడం లేదని మైనార్టీలు వాపోతున్నారు. బీజేపీ సూత్రాలను ఒంటపట్టించుకున్న బాబు తన నాలుగున్నరేళ్ల పాలనలో మైనార్టీలను దూరంగా పెట్టారని ఆవర్గం భావిస్తోంది. ఎన్నికలు మరో ఆర్నెల్లు ఉందనంగా ఆదరాబాదరాగా మైనార్టీలకు పదవులిస్తామంటూ వార్తలు లీకు చేయడంపై ఆ వర్గం గుర్రుగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వంలో మైనార్టీ వాణి వినిపించేవారే కరువయ్యారు. ఇప్పటికైనా బాషా కుటుంబానికి చేయూత నిస్తూ ఆకుటుంబంలోని వారికి పార్టీలో సముచిత ప్రాధాన్యం, ప్రాతినిధ్యం ఇవ్వాలని ముస్లిం వర్గం కోరుతోంది.

## స్వాతంత్ర్య దినోత్సవం రోజైనా మోదీ సత్యం పలకాలి

### మంత్రి కాలువ శ్రీనివాసులు



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఉపన్యాసాలతో ఓ ఊపు ఊపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజునైనా సత్యం పలకాలని ఏపీ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఏపీ సచివాలయంలోని పబ్లిసిటీ సెల్ లో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడు దశాబ్దాల కాలంలో దేశాన్ని ఎన్నో పార్టీలు, కూటములు పాలించాయని, అయితే, హామీలు అమలు చేయడంలో అత్యంత వైఫల్యం చెందడంలో మోదీ ఫస్ట్ అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో ఆయన ప్రసంగాలు విని మెరుగైన పాలన అందిస్తారన్న బలమైన విశ్వాసంతో ప్రజలు బీజేపీకి తిరుగులేని మెజార్టీ ఇచ్చారని, అయితే ఆయన దేశ ప్రజలను అడుగడుగునా వంచిస్తూ, వారిని కష్టాలు, కన్నీళ్లపాలు చేశారని మండిపడ్డారు. నాలుగేళ్ల తన పాలనలో దేశ ప్రజల ఆశలను మోదీ వమ్ము చేశారని, దేశాన్ని ఇరవై ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని అన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**అనంతపురం :** ర్యాగింగ్ భూతానికి మరో ఇంజనీరింగ్ విద్యార్థిని బలైంది. అనంతరపురం జిల్లా పట్నం గ్రామానికి చెందిన ప్రియాంక మదనపల్లి గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతోంది. గత కొంత కాలంగా సీనియర్ విద్యార్థి తనపై వేధిపులకు పాల్పడుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్‌కి ఫిర్యాదు చేసింది. సోమవారం సాయంత్రం బస్‌లో వెళ్తున్న సమయంలో కూడా మరోసారి వేధించాడని తీవ్ర మనస్తాపన చెందిన ప్రియాంక సూపర్ వాస్మోల్ తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. వేధింపులపై కళాశాల ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

## విశాఖలో జగన్ పాదయాత్ర



**తుని :** ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర 237వ రోజు మంగళవారం విశాఖ జిల్లాలోకి ప్రవేశించింది. నర్సీపట్నం నియోజకవర్గం గన్నవరం మెట్ట వద్ద విశాఖ జిల్లాలోకి అడుగుపెట్టిన జననేతకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు తూర్పుగోదావరి జిల్లా కాకరపల్లి నుంచి మంగళవారం పాదయాత్రను వైఎస్ జగన్ ప్రారంభించారు. జననేత వెంట నడిచేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. విశాఖపట్నం జిల్లాలో శరభవరం, శృంగవరం, గాంధీనగర్, వై దొండపేట జంక్షన్, ఎర్రవారం మీదుగా ఈరోజు పాదయాత్ర కొనసాగనుంది. సుమారు నెల రోజుల పాటు విశాఖ జిల్లాలో ప్రజాసంకల్పయాత్ర కొనసాగనుంది.

## జేఎన్‌యూపై కాషాయం పడగ



ఉమర్ ఖలీద్

**ఢిల్లీ:** శ్రీనగర్‌కు చెందిన షహలా రషీద్ షోరా అనే మహిళా విద్యార్థి కార్యకర్తకు ఫోన్‌లో బెదిరింపు సందేశాలు వచ్చాయి. మాఫియా డాన్ రవి పూజారి తనను బెదిరించడానికి ప్రయత్నించాడని ఆమె తెలిపింది. దాంతో తాను రవి పూజారి మీద పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు అతని మీద కేసు కూడా నమోదు చేశారని తెలిపింది. ఆమె ఫోనులో 'నువ్వు నోరు మూసుకో.. లేకపోతే మేమే శాశ్వతంగా నీ నోటిని మూయిస్తాము. ఇదే విషయాన్ని ఉమర్ ఖలీద్, దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీలకు కూడా చెప్పు. మాఫియా డాన్ రవి పూజారి అంటూ సందేశం పంపిచాడు. దాంతో షహలా రషీద్ అతని మీద పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకా రవి పూజారి పంపిన సందేశాన్ని స్క్రీన్‌షాట్ తీసి ట్విటర్‌లో పోస్టు చేశారు.

**జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌పై దాడి**

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ) విద్యార్థి సంఘం నేత ఉమర్ ఖలీద్‌పై సోమవారం ఢిల్లీలో హత్యాయత్నం జరిగింది. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఖలీద్‌పై గుర్తుతెలియని దుండగుడు తుపాకీతో కాల్పులు జరిపాడు. తర్వాత అక్కడ్నుంచి పరారయ్యాడు. ఈ దాడిలో ఖలీద్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. యునైటెడ్ అగినెస్ట్ హేట్ సంస్థ సోమవారం మూకహత్యలకు వ్యతిరేకంగా ఖౌఫ్ సే ఆజాదీ(భయం నుంచి విముక్తి)పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి సుప్రీంకోర్టు లాయర్ ప్రశాంత్ భూషణ్, ప్రొఫెసర్ అపూర్వానంద్, రోహిత్ వేముల తల్లి రాధిక, ఖలీద్ హాజరయ్యారు. కాల్పుల ఘటనపై ఖలీద్ స్పందిస్తూ.. 'మధ్యాహ్నం 2.30 గంటలకు బయట టీ తాగి సమావేశం దగ్గరకు తిరిగివస్తున్నాను. ఇంతలో వెనుక నుంచి బలంగా తోసేశారు. నేను కిందపడగానే తుపాకీ తీసి కాల్చేందుకు ప్రయత్నించాడు. దీంతో నేను అక్కడ్నుంచి పరిగెత్తా. చివరికి అతను ఘటనాస్థలం నుంచి పరారయ్యాడు' అని తెలిపారు.

## అమ్మకానికి అమరావతి బాండ్లు




**బీఎస్ఈ స్టాక్ ఎక్చేంజీలో ప్రవేశపెట్టిన సీఆర్‌డీఏ**

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** నవ్యాంధ్ర రాజధాని అమరావతి బాండ్లు అమ్మకానికి వచ్చాయి. అమరావతి నిర్మాణానికి నిధులు సేకరించే పనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి షేర్లను స్టాక్ ఎక్చేంజీలో అమ్మకానికి పెట్టింది. ఓ రాజధాని నిర్మాణం కోసం దేశంలోనే తొలిసారిగా బాండ్లు జారీ చేశారు. ఈ బాండ్లు రూ.10లక్షల ముఖ విలువతో సంస్థాగత మదుపర్లకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. తొలి విడతలో భాగంగా రూ.1,300 కోట్ల నిధుల సేకరణకు అమరావతి బాండ్లను సీఆర్‌డీఏ విడుదల చేసింది.బీఎస్ఈలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్లాట్‌ఫాం ద్వారా తొలివిడతలో 600 బాండ్లు విక్రయానికి అందుబాటులో ఉంచారు. వీటిపై మదుపర్లు ఆసక్తి చూపడంతో త్వరగానే అమ్ముడుపోయాయి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మరిన్ని బాండ్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది. బాండ్ల విక్రయాలను సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ సహా ఉన్నతాధికారులు కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తున్నారు.

## హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

హజ్ హౌస్ కు శంకుస్థాపన చేసాం, ఏపీ హజ్ యాత్రీకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటికి హాజరైన 200మంది హజీలు,వారి కుటుంబ సభ్యులు. 5బస్సులలో ప్రజావేదిక వద్దకు చేరుకున్న హాజీలు. జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అల్లాను మీరూపంలో చూడటం నాకెంతో ఆనందంగా ఉంది. ఒక పవిత్ర కార్యక్రమంలో మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ముస్లింల అభ్యున్నతికి ఈ బడ్జెట్‌లో రూ.1100కోట్లు కేటాయించామని, ముఖ్యమంత్రి, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇమాంలు, మౌజన్ లకు జీతాలు ఇస్తున్నామని, ఇందుకోసం బడ్జెట్ లో రూ.75కోట్లు కేటాయించామన్నారు. 8606 మంది ఇమాంలకు, మౌజన్ లకు వేతనాలు చెల్లించడం ఒక చరిత్ర, 225 షాదీఖానాల నిర్మాణారికి రూ.20 కోట్లు బడ్జెట్లో పెట్టాం, మరో రూ.20 కోట్లతో మసీదులకు మరమ్మతులు చేస్తున్నాం, రంజాన్, సంక్రాంతి రెండు పండుగలకు పేద ముస్లిం కుటుంబాలకు చంద్రన్న కానుకలు పేద ముస్లిం ఆడబిడ్డల పెళ్లిళ్ల బాధ్యత తీసుకున్నాం. అందుకోసం దుల్హన్ కింద రూ.50వేలు ఇస్తున్నాం. నా దేహంలో ప్రాణం ఉన్నంతవరకు ముస్లింలకు అండగా ఉంటా: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1,35,000మంది ముస్లిం విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లకు రూ.285కోట్లు ఖర్చు చేశాం. 1,41,000మంది ముస్లిం విద్యార్థులకు ప్రి మెట్రిక్ స్కాలర్ షిప్ లు ఇస్తున్నాం. విదేశీవిద్యకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షలు ఇస్తాం ముస్లిం విద్యార్థుల ఉన్న తోద్యాగాల పరీక్షల తర్ఫీదుకు ఎన్టీఆర్ విద్యోన్నతి, ముస్లింల నైపుణ్యాభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయించాం, ఉమ్మడి రాష్ట్రంలో హజ్ యాత్ర ప్రారంభించింది నేనే. హైదరాబాద్ లో హజ్ భవన్ నిర్మించింది నేనే, విజయవాడలో రూ.80 కోట్లతో హజ్ భవన్ నిర్మిస్తున్నాం. కడపలో మరో హజ్ భవన్ నిర్మిస్తున్నాం, మన రాష్ట్రం బాగుండాలని అల్లాకు దువా చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలకు మంత్రి పదవి ఇచ్చే అంశంపై కసరత్తు చేస్తున్నామన్నారు. ముస్లింల అభ్యున్నతికి అన్నివిధాలా కృషి చేస్తామని, ముస్లింల అభ్యున్నతికి మహనీయులు విరాళం ఇచ్చిన వక్ఫ్ భూములను కూడా కొందకు స్వార్ధ పరులు కబ్జా చేశారు. కబ్జా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుని వక్ఫ్ భూములను కాపాడతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం క్షేమం కోసం, ముసిం మైనారిటీల సంక్షేమం కోసం, పునాదుల నుంచి రాష్ట్ర నిర్మాణం కోసం రాత్రింబవళ్లు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కలకాలం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వందలాది హాజీలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.




## విజయవాడలో సరోగసి దందా... ?

**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** విజయవాడలో సరోగసి దందా బయటపడింది. కార్తీకదత్తా ఐవీఎఫ్ సెంటర్‌లో అద్దె గర్భాల దందా నడుస్తోంది. గుంటూరు నుంచి మహిళలను తీసుకొచ్చి అద్దె గర్భాల కోసం మహిళలతో బేరసారాలు చేస్తున్నారు. అయితే ఓ మహిళ నిరాకరించడంతో కార్తీకదత్తా ఐవీఎఫ్ సెంటర్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. నర్సింగ్ కోసమని చెప్పి గుంటూరు నుంచి ముగ్గురు మహిళలను తీసుకొచ్చిన కార్తీకదత్తా ఐవీఎఫ్ సెంటర్ యాజమాన్యం ఏమీ చెప్పకుండా ఏదో ఇంజక్షన్ ఇవ్వబోతుండగా ఓ మహిళ భయభ్రాంతులకు గురైంది. బాధితురాలు డయల్ 100కి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు.

## పరిపూర్ణానంద్‌కు హైకోర్టులో ఊరట



**హైదరాబాద్ :** పరిపూర్ణానందస్వామికి హైకోర్టులో ఊరట లభించింది. హైదరాబాద్ , రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు జారీ చేసిన ఉత్తర్వులపై కోర్టు స్టే విధించింది. నెలరోజుల క్రితం పరిపూర్ణానంద స్వామిపై నగర పోలీసులు బహిష్కరణ విధించారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయనహైకోర్టు కు వెళ్లారు. ఆయనపై హైదరాబాద్ పోలీసులు విధించిన నగర బహిష్కరణపై స్టే విధిస్తున్నట్టు కొద్దిసేపటి క్రితం హైకోర్టు ప్రకటించింది. తనపై బహిష్కరణ వేటు సరికాదని, తన వ్యక్తిగత స్వేచ్ఛకు అది భంగం కలిగిస్తోందని ఆయన హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై వాదోపవాదాలు విన్న తరువాత, ఆయన ఎక్కడైనా తిరగవచ్చని చెబుతూ, తదుపరి ఆదేశాలు వెలువడే వరకూ బహిష్కరణ ఉత్తర్వులను నిలుపుదల చేస్తున్నట్టు కోర్టు పేర్కొంది.

## 211పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**రాజుధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** టెట్ కమ్ టీఆర్టీ–2014లో మిగిలిన సెకండరీ గ్రేడ్ ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్సీ,ఎస్టీ,బీసీ కేటగిరిలో 211పోస్టులకు ఏపీ విద్యాశాఖ నోటిఫిక్షేషన్ జారీచేసింది.ఇంటర్,డీఈడీ,ఏపీ టెట్‌లో ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులను అర్హులుగా పేర్కొంది.ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.సెప్టెంబర్ 16న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు.

మీరూ స్పందించండి
మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి
యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధాని వార్తలు వేదికగా నిలుస్తుంది.
మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా
వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా
ఈ దిగువ ఉన్న వాట్సాప్ నంబర్లకు పంపించండి.
94406 62699

# స్వాతంత్ర్య సమరంలో మహిళలు


చంద్రముఖి బసు


కాదంబినీగంగూలీ


రమాబాయిరానేడ్


సిస్టర్ నివేదిత


స్వర్ణకుమారి దేవి


అరుణ అసిఫ్‌అలీఉష

ఆమె

స్వాతంత్ర్య సమరంలో ఎందరో మహిళామణులు పాల్గొని తమ పోరాటాలతో బ్రిటీషువారిని గడగడ లాడించారు. ఝాన్సీ లక్ష్మీబాయ్, కస్తూరీబా గాంధీ, సరోజినీ నాయుడు పేర్లనే చెబుతుంటారు గాని ఆ సంగ్రామంలో పాల్గొన్న చాలా మందికి చరిత్రలో చోటు దక్కలేదు.. అలాంటి వారిలో చంద్రముఖి బసు, కాదంబినీ గంగూలీ వీరిద్దరూ పశ్చిమ బెంగాల్ నుంచి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనగా, వీరి తర్వాత రెండేళ్లకు స్వర్ణకుమారి దేవి,రమాబాయి రానేడ్, సిస్టర్ నివేదిత, ఉష వంటివారు మహిళా చైతన్యంతో స్వాతంత్ర్యం కోసం ముందుకు ఉరికారు.

సాంఘిక దురాచారాలైన సతి, వితంతు వివాహాల కోసం రాజారామమోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు పోరాడిన తర్వాత 1929లో సతి దురాచారం, 1856లో వితంతు పునర్వివాహం జరిగిన తర్వాత మహిళా విద్యకు ప్రాధాన్యం లభించింది. దీంతో అనేక మంది మహిళలు విద్యనభ్యసించి స్వాతంత్ర్య ఉద్యమంలోకి దూకారు వారిలో చంద్రముఖిబసు, కాదంబినీ గంగూలీ

ఉన్నారు. వీరిద్దరు 1882లో డిగ్రీ పాసయ్యారు. ఆపై చంద్రముఖి ఎంఏ కూడా పాసై దేశంలో పీజీ పాసయ్యిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. బెతునే కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరిన ఆమె ఆపై ఆకళాశాల ప్రిన్సిపాల్‌గా ఎదిగారు. దక్షిణాసియాలో అకడమిక్స్‌ను ప్రారంభించిన మొదటి మహిళ ఆమె.సామాజికి ఉద్యమాలకు కూడా ఆనవాలుగా నిలిచారు. బ్రిటీషు విద్యతో పట్టణాలకు చెందిన మహిళలు చైతన్యవంతులయ్యారు. వీరంతా పరిపాలనా విభాగంలోనూ, వృత్తి విద్యల్లోనూ రాణించి రాజకీయ నాయకులుగా ఎదిగారు. నవభారతావనికి నాందిపలికారు. బెంగాలీ భాషలో ప్రథమ నవలా రచయిత్రిగా పేరుపొందిన స్వర్ణకుమారీదేవి (1855–1932) సాక్షి సమితిపేరుతో సంస్థను స్థాపించి తన రచనల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చారు. బహిరంగ సభల్లో ఆంగ్లంలో ప్రసంగించిన మొదటి మహిళగా రమాదేవి రానండే (1862–1924) గుర్తింపు పొందారు. హిందూ లేడీస్ సోషల్ అండ్ బొంబే లిటరసీ క్లబ్‌ను ఏర్పాటు చేసి అధ్యక్షురాలిగా పనిచేశారు. 1915లో సేవా సదన్ ఏర్పాటు చేసి బాలికా విద్యకోసం ఎంతగానో పాటుపడ్డారు. సిస్టర్ నివేదిత ఐరిష్ మహిళ ఆమె అసలు పేరు మార్గరేట్ ఎలిజబెత్ నోబెల్ 1915లో ఆమె స్వామి వివేకానందను కలుసుకున్నారు. ఆపై 1898లో ఆమె భారత్ చేరుకున్నారు. కాళి ద మదర్ పుస్తకంచూసిన అరవిందనాథ్ టాగోర్ భారత మాత బొమ్మను గీశారు. 1899లో కలకత్తాను పేల్లగువ్యాధి విజృంభించినప్పుడు రోగులకు ఆమె చేసిన సేవలు అపూర్వం. జగదీష్ చంద్రబోస్‌ను శాస్త్రీయ పరిశోధనల్లో కూడా ఆమె ఎంతగానో ప్రోత్సహించారు. ఆమె జీవితం భారతీయుల సేవలో గడిచిందని ఆమె సమాధిపై రాసి ఉంటుంది.


చివరిగా అరుణ అసిఫ్ అలీ గురించి తెలుసుకుందా.. జాతీయోద్యమంలో పాల్గొని జైలు పాలైన మహిళ ఆమె.1930లో గాంధీ మహాత్ముడి ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. అనేక బహిరంగ సభల్లోనూ, బ్రిటీషువారికి వ్యతిరేకంగా జరిపిన ప్రదర్శనలు, ర్యాలీల్లో ఆమె పాల్గొన్నారు. నేషనల్ కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారు. రెండు సార్లు తీహారు జైలు శిక్ష విధించారు. అయితే ఆమె అక్కడ కూడా జైలు పరిస్థితులపై ఉద్యమించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఢిల్లీ మొదటి మేయర్‌గా ఆమె ఎన్నికయ్యారు. ఆమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెను 'భారత రత్న'తో సత్కరించింది. 1998లో ఆమె స్మృత్యర్థం తపాలా బిళ్లను విడుదల చేసింది.

## జమాలున్నీసా బాజి (1915-)



బ్రిటిషర్ల బానిస బంధనాల నుండి విముక్తి కోసం పోరాటం మాత్రమే కాకుండా విముక్తి పోరాటాల స్ఫూర్తితో సమతా–మమతల సమసమాజ వ్యవస్థ స్థాపనకు నడుంకట్టిన జమాలున్నీసా బాజి 1915 ప్రాంతంలో హైదరాబాద్ పుట్టారు. ఉదార స్వభావులైన తల్లితండ్రులిచ్చిన స్వేచ్ఛ వలన చిన్నతనం నుండి జమాలున్నీసాకు స్వతంత్ర భావనలు అలవడ్డాయి. మంచి చదువరి ఆయిన ఆమెకు 13 సంవత్సరాల వయస్సు నుండి నిషేధిత 'నిగార్' పత్రికను చదవటం అలవాటయ్యింది. బ్రిటిష్ ప్రభుత్వ ఆధిపత్యం, మత ఛాందసాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన జమాలున్నీసా బాజి చివరకు బ్రిటిషర్ల మిత్రుడిగా మారిన నైజాం సంస్థానాధీశుడి చర్యలను కూడా నిరశిస్తూ ఉద్యమ బాట సాగరు. సంకుచిన ఆలోచనలు గల అత్తింటిలో అడుగుపెట్టిన జమాలున్నీసా ప్రతికూల వాతావరణంలో కూడా తన స్వతంత్ర భావనలను గాని కార్యాచరణను గాని వదులుకోలేదు. భారత స్వాతంత్ర్యసంగ్రామ చరిత్రలో 'అగ్గిపిడుగు' గా ఖ్యాతిపొందిన ప్రముఖ కవి మౌలానా హస్రత్ మోహని ప్రభావం ప్రబావం వలన ఆమె జాతీయోద్యమంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సామ్యవాద వ్యవస్త ఆలోచనలతో పాల్గొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సామ్యవాద వ్యవస్త ఆలోచనలతో ప్రభావితురాలైన జమాలున్నీసా బాజి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో స్వయంగా పాల్గొనకపోయినా, ఉద్యమకారులకు ఆతిధ్యం–ఆశ్రయం కల్పించి తొడ్పాటు అందించారు.

## టిపూ సుల్తాన్ (1750-1799)



ఉత్తర భారతాన్ని హస్తగతం చేసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, దక్షణ భారతాన్ని ఆక్రమించుకోవటానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతున్న సందర్భంగా సామ్రాజ్యవాద శక్తుల రాజ్యవిస్తరణ కాంక్షను బహిర్గతం చేస్తూ స్వదేశీయులను ఏకం కమ్మని పిలుపునిచ్చిన దర్శనికుడు, 'మైసూరు పులి'గా ఖ్యాతిగాంచిన టిపూ సుల్తాన్ 1750 నవంబర్ 10న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా దేవనహళ్ళి గ్రామంలో జన్మించారు. 'దక్షిణ భారతదేశ నెపోలియన్' గా ఖ్యాతి గడించిన హైదర్ అలీ ఆయన తండ్రి. ఆయన తల్లి పేరు ఫాతిమా ఫఖ్రున్నిసా. చిన్నతనంలోనే యుద్ధకళను ఔపోసన పట్టిన టిపూ సుల్తాన్ తండ్రితోపాటుగా పలు యుద్ధాలలో పాల్గొంటూ వచ్చారు. తండ్రి మార్గదర్శకత్వంలో ఆయన అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. 1782లో తండ్రి హైదర్ అలీ కన్నుమూయగా టిపూ మైసూరు రాజ్యలక్ష్మిని చేబట్టారు. ఆ రోజున టిపూ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, 'మిమ్మల్ని వ్యతిరేకించినట్టయితే నేను నా స్వర్గాన్నీ, నా జీవితాన్నీ, నా ప్రజల సంక్షేమం లోనే నా సంక్షేమం ఇమిడి ఉంది. నాకిష్టమైందల్లా మంచిదని నేను భావించను. నా ప్రజలకు ఏది ఇష్టమో దానిని నా అభీష్టంగా భావిస్తాను...నా ప్రజలకు ఎవరు శత్రువులో వారు నాకూ శత్రువులు. నా ప్రజలతో ఎవరు కలహిస్తారో, వారు నాతో యుద్ధం ప్రకటించినట్లే' అని ప్రకటించి చివరివరకు ఆ మాటను పాటించారు. ఒకవైపున నిజాం నవాబు, మరాఠాలను మరోవైపు అంగ్లేయులను నిత్యం ఎదుర్కొంటూ 17 సంవత్సరాల పాటు ఆయన పాలన సాగింది. టిపూ సుల్తాన్ తన రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణానది నుంచి, దక్షిణాన దిండిగల్ వరకు అంటే సుమారు 400 మైళ్ళ పొడవున, పశ్చిమాన మలబారు నుంచి, తూర్పున తూర్పు కనుమల వరకు సుమారు 300 మైళ్ళు విస్తరింప చేశారు ఆధునిక వ్యాపార, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ఆయన బహుధా ప్రోత్సహించారు. చిన్న చిన్న నేరాలను చేసినవారిని సంఘ ప్రయోజనాలకు పనికొచ్చేలా వినూత్న శిక్షలు విధించారు.

## కాలమ్

### "ప్రధాని మోడీని ఈ రేంజ్‌లో నిలదీసిన సోషల్ యూజర్ ఎవరు లేరు"

'ఆగష్టు 15న ఎర్రకోట మీద నుంచి ఏం మాట్లాడాలి చెప్పండి" అని కోరినందుకు ఉతికి ఆరేశారు. పరనాయుడు మామిడి అనే సోషల్ మీడియా యూజర్. ఆ నిలదియ్యటం ఏ రేంజ్‌లో ఉందంటే సోషల్ మీడియాలో పెద్ద వైరల్ సెన్సేషల్ అయ్యింది. తప్పక చదవండీ... కొన్ని వందల మంది క్యూలైన్లలో నిలబడి ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన, కొన్ని వేల చిరు వ్యాపారులు రోడ్డున పడడానికి కారణమైన "పెద్ద నోట్ల రద్దు" ప్రకటించే ముందు ప్రజల అభిప్రాయం ఎందుకు అడగలేదు??

సరైన అవగాహన మీకు లేకుండా, వ్యాపారస్తులకు సరైన అవగాహన కల్పించకుండా, పన్ను మదింపు వ్యవస్థలను వ్యాపారులకు అందుబాటులోకి తేకుండా, ప్రజల్లో అవగాహన కల్పించకుండా, వారి కష్టార్జితాన్ని అడ్డంగా దోచుకోవడానికి కారణమైన జీఎస్‌టీ ప్రకటించే ముందు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

సుమారు లక్షా 30 వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీసిన రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు ప్రకటించే ముందు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

సరిహద్దుల్లో సైన్యం ప్రాణాలొడ్డి పోరాడుతుంటే, ఎటువంటి అజెండా లేకుండా మీరు శత్రు దేశం వెళ్లి ఆ ప్రధానితో ఉయ్యాలలూగుతూ మన సైన్యం మనోభావాలు దెబ్బతీసినపుడు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

కాశ్మీర్ లో ఒక చిన్నారిని అమానుషంగా రేప్ చేసి చంపిన ఘటనలో దోషులకు మద్దతుగా మీ పార్టీ నాయకులు మంత్రులు ర్యాలీ చేసినప్పుడు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

అప్పుల్లో కూరుకుపోయిన బ్యాంకులో వాటాలను, ప్రజా ధనంతో నడిచే ఎల్ఐసీ సంస్థ కొనే ముందు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

మధ్యతరగతి ప్రజల కష్టార్జితం తో ముడిపడి ఉన్న ఎఫ్ఆర్‌డీఏ బిల్లు తీసుకురావాలని నిర్ణయించే ముందు ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు??

ఇలా చెబితే చాంతాడంత ఉంది. అసలు ఈ నాలుగున్నరేళ్లు కాలంలో ఒక్క సారైన ప్రజల అభిప్రాయం కోరారా??

ఒక్కసారైనా ప్రజలతో ముఖాముఖీ మాట్లాడారా?

దేశంలో జరుగుతున్న విపరీత పరిణామాలపై ఒక్క సారైనా పత్రికా విలేఖరుల ముందు మాట్లాడారా??

ఎంతసేపూ రేడియో లోనో, టీవీ లోనో లేదా యాప్ ద్వారానో తప్ప సామాన్య జనంలోకి వచ్చి ఎందుకు మాట్లాడరు??

పెద్ద పెద్ద బిగ్ షాట్ లను హత్తుకునే మీరు ఒక సాధారణ వ్యక్తి చేతిలో చెయ్యి వేసి వారితో ఎందుకు మాట్లాడారు..??

ప్రపంచ పటంలోని దేశాలన్నీ చుట్టి రావడానికి ఇష్టపడే మీరు సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, దేశంలోని గ్రామాల్లో ఎందుకు పర్యటించరు??

నిరుపేద కుటుంబం నుండి వచ్చానని చెప్పుకునే మీరు కేవలం సంపన్నులను మాత్రమే కలుస్తారు, కానీ పేద మధ్య తరగతి వారిని కలవరు ఎందుకు?

5 కుటుంబాల కోసం లక్ష కోట్లతో బుల్లెట్ రైలు వేసే మీరు...

5 కోట్ల మంది రాజధాని గురించి ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోరు??

పదవీకాలం చివరలో మాత్రమే మీకు ప్రజాభిప్రాయం గుర్తుకు వచ్చిందా....

అయినా మీరు అడుగుతున్నారు కాబట్టి నా అభిప్రాయం చెబుతున్నా...

"ప్రజలమధ్య కులాల, మతాల చిచ్చు పెట్టి నీచ,విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల అవసరాలు, అభివృద్ధి పట్టించుకోని మీలాంటి వారు ఈ దేశ పాలకులుగా ఉండరాదు"


# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్:9440662699

## ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్- రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ, విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 98484 42436

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్.టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

## విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ–ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755


# కేరళ వరద బాధితులకు కమల్, బన్నీ విరాళం!





**కేరళ :** భారీ వర్షాలు – వరదలతో కేరళ రాష్ట్రం అతలాకుతలమవుతోన్న సంగతి తెలిసిందే. వేల కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసం కావడం – పలు ఇళ్లు నీట మునగడం వల్ల ఇప్పటి వరకు 50 మంది మరణించారు. ప్రస్తుతం కేరళలో జనజీవనం స్తంభించింది. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులవ్వగా మరెంతో మంది తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే కేరళ వరద బాధితుల సహాయార్థం దక్షిణాది సినీ హీరోలు నడుం బిగించారు. విలక్షణ నటుడు కమల్ హాసన్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షలు విరాళం అందించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ విషయాన్ని స్వయంగా తన ఫేస్ బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. దాంతోపాటు విజయ్ టీవీ రూ.25 లక్షలు విరాళం ఇచ్చిందని ఫేస్ బుక్ లో పోస్ట్ చేశారు. కేరళ వరదబాధితుల సహాయార్థం 'కేరళ రెస్క్యూ' పేరుతో తమిళ హీరో విశాల్ విరాళాలు – వస్తువులు సేకరించారు. కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీఎం పినరయి విజయన్ పిలుపునివ్వడంతో దానికి స్పందించిన కోలీవుడ్ హీరోలు సూర్య – కార్తీ బ్రదర్స్ 25లక్షల విరాళాన్ని ఇచ్చారు. తనకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న టాలీవుడ్ హీరో బన్నీ (అల్లు అర్జున్) కూడా రూ. 25 లక్షలు ప్రకటించాడు. దాంతోపాటు విజయ్ దేవరకొండ కూడా రూ. 5లక్షలు డొనేట్ చేశాడు. ది అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) ..రూ.10లక్షలు డొనేట్ చేసింది.

**కేరళ వరదలు: 'కేంద్రం సాయం అంతంత మాత్రమే**

**తిరువనంతపురం:** కేరళ వరదల నేపథ్యంలో కేంద్రం సాయం అంతంత మాత్రమేనని రాష్ట్ర మంత్రి థామస్ ఐజాక్ అన్నారు. కేంద్రం సాయం కంటే విరాళాల ద్వారా వచ్చిన సాయమే ఎక్కువగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో వరదల కారణంగా 37 మంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు రూ.8,316కోట్ల మేర నష్టం వాటిల్లింది.

దీని నుంచి బయట పడేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వం కేంద్రం నుంచి తక్షణ సాయం కింద రూ.1,220కోట్లను అడిగింది. కానీ కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేసి, బాధితులను పరామర్శించి తక్షణ సాయం కింద వంద కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

వరదలతో ఎనిమిది వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, ఆ నష్టాన్ని వెంటనే భర్తీ చేసేందుకు కనీసం రూ.3వేల కోట్లు అయినా అవసరమవుతాయని, కానీ కేంద్రం వంద కోట్లు మాత్రమే ప్రకటించిందని ఆయన వాపోయారు.

కాగా, రాష్ట్ర మంత్రి థామస్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కేజే ఆల్ఫోన్స్ స్పందించారు. తాను, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజుజు కేరళలో పర్యటించామని, కానీ థామస్ ఇప్పటి వరకు తన నియోజకవర్గమైన అలెప్పీలో పర్యటించలేదని, మరి ఆయన ఎందుకు మాట్లాడుతున్నారని, తాను కేరళ కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వమని కోరానన్నారు.

# మాల్యా ఇంట్లో గోల్డెన్ టాయిలెట్!




**ముంబై :** సుమారు 10వేల కోట్లకుపైగా రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన లిక్కర్ కింగ్ విజయ్‌మాల్యా గురించి రచయిత, ప్రొఫెసర్ జేమ్స్ క్రాబ్‌ట్రీ సంచలన వ్యాఖ్యలు చేశారు. లండన్‌లో ఉండగా మాల్యాను కలవడానికి జేమ్స్ వెళ్లినప్పుడు ఆయనకు కనిపించిన దృశ్యాలు షాక్‌కు గురిచేశాయట. ఆ విషయం గురించి ఆయన తాజాగా వెల్లడించారు. 'లండన్‌లోని మాల్యా ఉంటున్న భవంతిలో ఆయనతో నాలుగు గంటలు గడిపే అవకాశం వచ్చింది. నేను అక్కడికి వెళ్లినప్పుడు ఆయన ఎంతో బాధపడుతున్నట్లు కనిపించారు. అప్పుడు ఆయన మద్యం సేవిస్తూ ఉన్నారు. ఆయనతో కాసేపు మాట్లాడిన తర్వాత మాల్యా అనుమతితో అక్కడున్న వాష్‌రూమ్‌లోకి వెళ్లాను. అక్కడ ఉన్న గోల్డెన్ టాయిలెట్ చూసి ఆశ్చర్యపోయాను' అని జేమ్స్ వెల్లడించారు. అంతేగాక, 'బంగారంతో చేసిన రిమ్, మూత కూడా ఉంది. అరె! ఇక్కడ గోల్డెన్ టిష్యూ పేపర్ కూడా ఉంటే బావుండని అనుకున్నాను. దానికి బదులుగా అక్కడ తెల్లటి, మెత్తనైన టవల్స్ ఉన్నాయి. అక్కడ వీటన్నింటినీ చూసి ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. టాయిలెట్‌ను మెయింటెన్ చేసే తీరును బట్టి ఎదుటి వాళ్ల గురించి చెప్పేయవచ్చు.' అని జేమ్స్ వ్యాఖ్యానించారు. ఇటీవల జేమ్స్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ఈ వివరాలు తెలిపారు. ముంబైలోని ఓసమావేశంలో విజయ్ మాల్యా గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం జేమ్స్ చెప్పిన మాటలతో మాల్యా తన జీవితాన్ని ఏ విధంగా ఎంజాయ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన మాల్యా.. తన విలాసాలను మాత్రం వదులుకోవడం లేదన్నమాట.

## శ్రావణమాసంలో ప్రత్యేక రైళ్లు




**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** శ్రావణ మాసంలో వరుస పెళ్లిళ్లు ఉండటంతో హైదరాబాద్–కాకినాడ టౌన్–నర్సాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు వెల్లడించారు.ఆగస్టు 14న హైదరాబాద్–నర్సాపూర్, ఆగస్టు 15న నర్సాపూర్–హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు.ఆగస్టు 15,19తేదీలల్లో కాకినాడ టౌన్–హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు.

# మళ్లీ నువ్వేరావాలి..!




**రాజధాని వార్తలు వినుకొండ :** మా బిడ్డల భవిష్యత్ కోసం .... మళ్లీ నువ్వేరావాలి అని వైసీపీ ఫ్లెక్సీ ఇప్పుడెంతగానో ఆకట్టుకుంటోంది. చిత్రమైన ఈ ఫ్లెక్సీ గుంటూరుజిల్లా వినుకొండ నియోజకవర్గంలోని కొండ్లముట్ల ప్రజలు తమ గ్రామంలో పెట్టారు. ఈ ఫ్లెక్సీలో చంద్రబాబు నవ్వే ప్రత్యేక ఆకర్షణ. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రచారం సృజనాత్మకతను కనబరిచింది.విభజిత రాష్ట్రానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబు పాలన ఎంత అవసరమో జనాల్లోకి టీడీపీ శ్రేణులు బలంగా తీసుకెళ్లాయి. జాబు కోసం, నిరుద్యోగ భృతి రూ.2వేలు దక్కాలంటే, రైతురుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ, 24 గంటలూ విద్యుత్ సరఫరా, రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపనకు, వెనుకబడిన జిల్లాలకు బందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ రావాలంటే... చంద్రబాబు అధికారంలోకి రావాలని టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించాయి.హామీల సంగతేమోగాని... చంద్రబాబుకు మాత్రం సీఎం హోదా దక్కింది. ఇప్పటికీ రైతు రుణమాఫీ రెండు కంతులు చెల్లించాల్సి ఉంది. నిరుద్యోగ భృతి నిన్నమొన్నటి వరకు ఊసేలేదు. ఆరేడు నెలల్లో ఎన్నికలు ఉన్న తరుణంలో నెలకు రూ.వెయ్యి చొప్పున 12 లక్షల మంది నిరుద్యోగులకు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రత్యేకహోదా హూష్.. కాకి. ఇంటికో ఉద్యోగం కథ కంచికి. హామీ ఇవ్వని వాటిలో లోకేష్‌కు మంత్రివర్గంలో కొలువు లభించింది. ఈ నేపథ్యంలో వినుకొండ నియోజకవర్గంలోని కొండ్రముట్ల గ్రామస్తులు మా బిడ్డల భవిష్యత్ కోసం... ప్రతిపక్షంలోకి మళ్లీ నువ్వేరావాలి.. అని పేరు లేకుండా కేవలం చంద్రబాబు భారీ ముఖ చిత్రాన్ని ఫ్లెక్సీపై ప్రదర్శించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ప్రభుత్వాలు ఏవైనా కార్పొరేట్ సంస్థలకు లాభాల పరుగులు పెట్టించాలనే చూస్తుంటాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రక్రియ మితిమీరింది. అంబానీ, ఆదాని, వేదాంతాలు ఆస్తులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.. అంబానీ కొడుకు పెళ్లికార్డు ఖరీదు ఒక్కొక్కటి లక్షన్నర .. నిజానికి ముఖేష్ తండ్రి ధీరూభాయ్ అంబానీ ఎమంత స్థితిమంతుడు కాదు.. అతి సామాన్యుడు.. అయినప్పటికీ కేవలం దశాబ్ధకాలంలో ఎంతగా ఎదిగారంటే ...**

# అపర కుబేరులు... ఆకలి చావులు



## 72 ఏళ్ల స్వతంత్ర్య భారతం..

ముఖేష్ అంబానీ ఇంద్రభవనం కట్టించుకోవాడానికి 7 ఏళ్లు పట్టింది. ఈ భవనం పేరు ఎంటిలియా ఆయన జీవిత భాగస్వామి పుట్టిన రోజు కానుకగా దీన్ని నిర్మించారు. భవనం మొత్తం విస్తీర్ణం 4 లక్షల చదరపు అడుగులు 27 అంతస్తులు 9 లిఫ్టులు 3 హెలీపాడ్స్, 1 సినిమాహాల్, వ్యాయామ శాల, ఉద్యానవనం 168 కార్లు నిలుపుకునే పార్కింగ్, 600 గదులు, 600 మంది పనివారు, ఇది ఒక కుటుంబం నివశిస్తున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఇల్లు..మొత్తం ఖర్చు 4,700 కోట్లు, ఈయనకు ముగ్గురు పిల్లలు.. ఆయన జీవిత భాగస్వామితో అంతపెద్ద ఇంటిలో ఉంటారు. ఈ ఇంటి మొదటి నెల కరెంటు బిల్లు రూ. 71 లక్షలు .. భారత ప్రభుత్వం వీరికి కరెంటు బిల్లులో రాయితీలు కూడా ఇస్తుంది. ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తుంటాయనడంలో ఇంతకంటే ఏం ఉదాహరణ కావాలి ?





తాజాగా ముఖేష్ అంబానీ నీటిపై తేలియాడే భవనాన్ని కొనుగోలు చేశారు. ఆ ఇంటి వివరాలు సౌకర్యాలు తెలుసుకుందాం. దీన్ని ఫ్రాన్స్ షిప్పింగ్ బిల్డింగ్ కంపెనీ నిర్మించింది. ఇది నీటిపై తేలియాడే భవనం అనే కంటే ఒక పెద్ద షిప్ (ఓడ) అనడం సబబుగా ఉంటుంది. దీనిలో సకలసౌకర్యాలతోపాటు అద్భుతమైన హంగులతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఒక భవనాన్ని పోలి ఉండే ఈ నౌక ముంబైలోని బీచ్ క్యాండీలో ఉంది. 58 మీటర్ల పొడవు, 38 మీటర్ల వెడల్పుతో ఇది చూపరులను ఔరా అనిపించేలా ఉంటుంది. 36 వేల చదరపు అడుగుల వైశాల్యంతో 12 మంది ప్రయాణీకులు 20 మంది నౌకా సిబ్బందికి కావాల్సిన ఏర్పాట్లు సౌకర్యాలు కలిగి ఉంటుంది. దీనికి సగం కరెంటు మరో సగం సోలార్ వాడతారు. ఈ సోలార్ ఒక్కరోజుకు 5 వేల కిలోవాట్ల కరెంటును ఉత్పత్తి చేస్తుంది. ఈ నౌకను గుర్రపు డెక్క ఆకారంలో నిర్మించడం విశేషం. ఇందులో 25 మీటర్ల స్విమ్మింగ్ ఫూల్ ఒక మసాజ్‌లు ఉన్నాయి. ఒక థియేటర్, టెర్రస్ ఉంటాయి. ఒక లిఫ్టు, బారు సౌకర్యాలుకూడా ఉన్నాయి. గెస్టుల కోసం కొన్ని ప్రత్యేక గదులు ఇందులో ఏర్పాటు చేశారు. పైన అమర్చిన సోలార్ ప్యానెల్స్ ఈ బిల్డింగ్‌లకు కావాల్సిన ఇంధనాన్ని అవే ఉత్పత్తి చేస్తాయి. ఇవన్నీ ఈ నీటిమీద తేలియాడే బిల్డింగ్ ప్రత్యేకతలు. తన కనుసన్నలతో ప్రభుత్వాలను శాసిస్తున్న ముఖేష్ అంబానీ భవిష్యత్తులో ఇంకెన్ని విలాస వంతమైన భవనాలను నిర్మించి అందరినీ అబ్బురపరచనున్నాడో చూద్దాం..



**ముంబై మహానగరంలో చౌపాటీ బీచ్ ఎదురుగా ఉన్న ముఖేష్ అంబానీ అత్యాధుని భవనం ఎంటిలియా ఉండే అదే నగరంలో ఆసియాలోకెల్లా అతిపెద్దదైన మురికివాడ ధారవి. 500 ఎకరాల్లో విస్తరించిన ఈ మురికివాడలో సుమారు 3 లక్షల మంది అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్నారు.**



ఆకలి బాధ అనుభవించేవారికే తెలుస్తుంది.. ఎప్పుడైనా ఒక్కసారి తినడం లేటయితే తల్లడిల్లిపోయే మనం..ఈ దేశంలో రోజుకు ఎంతమంది ఆకలి చావులకు బలవుతున్నారో తెలుసుకోవాలి...గతేడాది అక్టోబరులో విడుదలైన ప్రపంచ ఆకలి సూచీలో 119 దేశాల జాబితా ఉంటే అందులో మనస్థానం 100. మనపొరుగున ఉన్న చిన్న దేశాలైన బంగ్లాదేశ్, (88), శ్రీలంక (84), మయన్మార్(77), నేపాల్ (72) ఎంతో మెరుగ్గా ఉన్నాయి. మన దేశంలో ఎక్కడైనా ఆకలి చావులు సంభవించాయంటే మన ప్రభుత్వాలు వెంటనే ఆకలితో కాదు.. అనారోగ్యంతో మరణించారని దాబాయిస్తాయి. గతేడాది జార్ఖండ్‌లో 11 ఏళ్ల బాలిక , 58 ఏళ్ల సావిత్రిదేవి మరణించినప్పుడు ఆ ప్రభుత్వం దాన్ని నిష్కర్షగా తోసి పుచ్చింది. అనారోగ్యం చావులని వాదించింది. చుట్టుపక్కల వాళ్లు రాష్ట్రాన్ని అప్రదిష్ట పాలు చేస్తున్నారని ఆ కుంటుంబాన్ని వెలివేశాయికూడా.. నిజానికి ఆరు నెలల ముందు చౌకధరల దుకాణాదారుడు కార్డును రద్దు చేయడంతో వీరిరువురూ ఆకలి చావులకు గురయ్యారు.

జూన్ 26న దేశరాజధాని ఢిల్లీలో ముక్కుపచ్చలారని ముగ్గురు పిల్లలు ఆకలితో అలమటించి చనిపోయారంటే ఎం చెప్పుకోవాలి ? వారికి పోస్టుమార్టం చేసిన డాక్టరు నా 40 ఎళ్ల సర్వీసులో ఇలాంటి కేసు చూడలేదు.. వారి కడుపులు పూర్తిగా ఖాళీగా ఉన్నాయి. కనీసం ఎనిమిదిరోజుల పాటు తిండి తిని ఉండరని ఆ డాక్టరు తేల్చిచెప్పారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మంగళ్ వీణ దంపతులకు శిఖా (8), మాన్వి(4), పారుల్ (2) ముగ్గురు పిల్లలు.. పొట్ట చేతపట్టుకొని వారంతా ఢిల్లీ వచ్చారు. మండవలిలోని ముకులు మెహ్రా అనే వ్యక్తి అతనికి రిక్షాను , ఒక గదిని అద్దెకు ఇచ్చాడు..



మంగళ్ అద్దెరిక్షా ఎవరో ఎత్తుకుపోవడంతో దాన్ని వెతుకుతూ పిల్లలకు అన్నంపెట్టలేకపోయాడు.. ఆకలితో అలమటించిన ముగ్గురు పిల్లలు సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో వారిని ఆసుపత్రికి తీసుకు వెళ్లగా డాక్టర్లు చనిపోయారన్నారు. దీంతో వారి తల్లి ఒక్కసారిగా భోరుమంది.. అసలు వారు ఎలా చనిపోయారని పోలీసులు ప్రశ్నిస్తే నాకు ఒక ముద్ద అన్నం పెట్టండంటూ ఆమె అరుస్తూ అక్కడే పడిపోయింది... ఎంత హృదయ విదారక ఘటన.

**డబ్బున్న వాడికి దయ ఉండదు.. అనే దానికి ఎంటిలియానే ఒక ఉదాహరణ.. ఈ ఇంటివారికి ఏమాత్రం సమాజ బాధ్యత లేదు. దేశంలో తిండితిప్పలు లేని వారు కోట్లమంది ఉండగా నలుగురు నివసించడానికి ఇంత పెద్ద ఇల్లు కట్టుకోవడం దేశానికి సిగ్గుచేటు..**

**– రతన్ టాటా**

**– ఖాన్**

## సంక్షేమ పథకాలన్నీ కాగితాల్లోనే...



మన దేశ జనాభా అంతటికీ ఏడాది పొడుగునా కడుపు నిండాలంటే దాదాపు 23 కోట్ల టన్నుల ఆహారం కావాలి... నిరుడు మన ఆహార దిగుబడి 27.5 కోట్ల టన్నులు.. అంటే నాలుగున్నర టన్నులు మిగులు సాధించినా ఆకలి చావులు నిత్యకృత్యం అవుతున్నాయి. రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఆకలిచావులు చాలా వరకు లెక్కలోకి రావు.. బడికొచ్చే పిల్లల కోసం మధ్యాహ్న భోజన పథకం ఉంది..ఆరేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు, పిల్లల తల్లుల కోసం పౌష్టికాహారం అందించడానికి అంగన్‌వాడీలు ఉన్నాయి.బియ్యం,పప్పులు, నూనె, ఉప్పు వగైరా చవగ్గా అందించడానికి చౌక ధరల దుకాణాలున్నాయి. ఇంకా ఐదేళ్ల క్రితం అమలులోకి వచ్చిన ఆహార భద్రతా చట్టం ఉంది. అయినా ముగ్గురు పిల్లలు చనిపోయిన తలాబ్ చౌక్ ప్రాంతానికి చెందిన చాలా కుటుంబాలకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేవు.. వీటి కోసం ఆఫీసులు చుట్టూ తిరిగితే ఏదైనా బిల్లు తేవాలని అడుగుతున్నారని పేదలు వాపోతున్నారు. సమస్తానికి ఆధార్ లింక్ చేసి బిల్లులు అడగడంలోనే ప్రభుత్వం డొల్లతనం తెలుస్తుంది.. బెంగాల్ నుంచో, బీహార్‌నుంచో పొట్టపోసుకోవడానికి వచ్చిన కుటుంబాలకు ఇవన్నీ అసాధ్యం గనుక ఏ పథకంలోనూ వారు చేనే అవకాశం ఉండదు.. సంక్షేమ పథకాలన్నీ కాగితాల్లో నిక్షిప్తమై ఉంటే పేదలు ఆకలితో నకనకలాడతారు.. మన దేశంలో ఉన్న అసంబద్ధ , అన్యాయ వ్యవస్థలు ప్రపంచంలోనే ఎక్కడా లేవు.. మన దేశంలో 3 లక్షల మంది పిల్లలు ప్రతి ఏడాది చనిపోతున్నారు. ఎంతోమంది పిల్లలు ఆకలితో నిద్రిస్తున్నారు.ఐదేళ్లలోపు పిల్లలు మృతి చెందడానికి కారణం పౌష్టికాహారలోపమే అని యునెసెఫ్ తెలిపింది. ఆకలితో శరీరమేకాదు మెదడు కూడా కృషించి పోతుంది. దీంతో కొన్ని తరాలపాటు వారికి మేథకులు పుడతారు.. ఆర్థికంగా ఎంత ప్రగతి సాధించామన్నది కాదు...ఎంతమంది మూడు పూటలూ తినగలిగే పరిస్థితులు కల్పించామన్నదే ప్రభుత్వాలు గుర్తించాలి.. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ఆకలి సమస్యను తీర్చాలి.. లేదంటే స్వతంత్ర్య భారతావనికి తీరని అవమానం...


# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం

## సభ్యులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, సహోద్యుగులకు

# 72వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

డోర్ నెం.54-16-3/3, ప్లాట్ నెం.48,రోడ్డు నెం.3, లయోలా గార్డెన్స్, లయోలా కాలేజీ ఎదురు.

విజయవాడ- 520 008. కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 0866-2452129, email : housing.emp@gmail.com


Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com